ప్రజానేస్తం జ్వాల

నిజం కోసం... నిర్భయంగా...

www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

‘బ్రేకింగ్ బ్యాడ్’ తర్వాత ఇప్పుడు ‘ప్రిజన్ బ్రేక్’: విజయ్ ప్రభుత్వంపై స్టాలిన్ విమర్శలు

2

అక్టోబర్ 28 బుధవారం 2026 | సంపుటి : 1 | సంచిక : 19 | పేజీలు : 6 | వెల రూ. 4.00/- | ఎడిటర్ : చెన్నగాని పురుషోత్తం

WEDNESDAY OCTOBER 28 2026 | VOL:1 | ISSUE: 19 | PAGES:6 | Rs. 4:00 | EDITOR: CHENAGANI PURUSHOTHAM

ఎల్‌నినో ముప్పు.. రెండో పంటకు దూరంగా ఉండండి!

- ప్రాజెక్టులు ఎండిపోయే ప్రమాదం ఉందన్న మంత్రి పొంగులేటి
- కరువు పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రైతులు నిర్ణయం తీసుకోవాలి
- తెలంగాణకు రావాల్సిన నిధుల కోసం అఖిలపక్షంతో ఢిల్లీకి వెళ్తాం కరువుపై అప్రమత్తంగా ఉండాలి

సంగారెడ్డి, అక్టోబరు 27

ఎల్‌నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని ప్రాజెక్టులన్నీ ఎండిపోయే ప్రమాదం ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. కరువు పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రైతులు ఈ ఏడాది రెండో పంట సాగు చేయకుండా ఉండాలని (మిగతా 2వ పేజీలో..)



పెట్టుబడులే లక్ష్యం.. గ్లోబల్ సమ్మిట్‌కు భారీ ఏర్పాట్లు!

- డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో సదస్సు
- 550కుపైగా దేశీయ, అంతర్జాతీయ దిగ్గజ సంస్థలకు ఆహ్వానాలు
- 25 రంగాలుగా సమ్మిట్ వేదిక విభజన.. ఒప్పందాలకు ప్రత్యేక ఏర్పాట్లు
- యువతకు విస్తృత ఉపాధి అవకాశాల కల్పనే ప్రధాన లక్ష్యం
- పెట్టుబడుల ఆకర్షణకు రేవంత్ సర్కార్ కార్యాచరణ




హైదరాబాద్, అక్టోబరు 27 :

తెలంగాణకు భారీ పెట్టుబడులను ఆకర్షించి, రాష్ట్రాన్ని అంతర్జాతీయ పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తోంది. ఇందులో భాగంగా డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో తెలంగాణ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్--2026 నిర్వహించనుంది. ఈ సదస్సు ద్వారా వివిధ రంగాల్లో పెట్టుబడులకు అవకాశాలు కల్పించడంతోపాటు, రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి ఊతమివ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేపడుతోంది. దిగ్గజ సంస్థలకు ఆహ్వానాలు గ్లోబల్ సమ్మిట్‌కు 550కుపైగా దేశీయ, అంతర్జాతీయ దిగ్గజ సంస్థలను ఆహ్వానించారు. ప్రధాన సదస్సుకు 1,500కుపైగా కంపెనీలు, సంస్థల ప్రతినిధులను ఆహ్వానించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 29న న్యూఢిల్లీలో సమ్మిట్ కర్టెన్ రైజర్ కార్యక్రమం జరగనుంది. దీనికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. వివిధ దేశాల రాయబారులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలను ఈ కార్యక్రమం ద్వారా గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానించనున్నారు. రక్షణ, ఏరోస్పేస్ రంగాలపై ప్రత్యేక దృష్టి తెలంగాణలో పెట్టుబడులకు విస్తృత అవకాశాలున్న రక్షణ, ఏరోస్పేస్ రంగాలకు ఈ సదస్సులో ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. రక్షా ఎక్స్‌పోలో పాల్గొనేందుకు వందకుపైగా కంపెనీలు, సంస్థలకు ఆహ్వానాలు పంపించనున్నారు. ఇప్పటికే చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ నగరాల్లో ‘ఇన్వెస్ట్ తెలంగాణ’

రాష్ట్రం పిచ్చోడి చేతిలో రాయిలా మారింది: కేటీఆర్

- ప్రభుత్వమే కృత్రిమ కరవు సృష్టిస్తోందని కేటీఆర్ ఆరోపణ
- గోదావరిలో నీళ్లున్నా ఎత్తిపోయడం లేదని విమర్శ
- మరో ఏడాదిన్నరలో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని వ్యాఖ్య

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. గోదావరిలో నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ, వాటిని ఎత్తిపోయకుండా ఉద్దేశపూర్వకంగానే రాష్ట్రంలో కరవు పరిస్థితులను సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం రైతులను వరి వేయవద్దని (మిగతా 2వ పేజీలో..)



అర్ణబ్ ఎఫెక్ట్.. ఉత్తరాంధ్రలో పూర్తిగా మారిన వాతావరణం

- పశ్చిమమధ్య బంగాళాఖాతంలో బలపడిన ‘అర్ణబ్’ తుపాను
- రేపు ఉదయం బాపట్ల-విశాఖ మధ్య తీరం దాటే అవకాశం
- తీరం దాటే సమయంలో గంటకు 125-135 కి.మీ. వేగంతో గాలులు

కోస్తాంధ్ర జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాల హెచ్చరిక (మిగతా 2వ పేజీలో..)

1.90 లక్షల మంది మహిళలకు కుట్టు మిషన్లు!

- డిసెంబర్ 9న పంపిణీకి కార్యాచరణ సిద్ధం చేయాలి
- కుట్టు మిషన్ల కోసం 4.80 లక్షల దరఖాస్తులు
- స్వయం ఉపాధి, నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు
- బీసీ సంక్షేమ పథకాలపై సమీక్ష



హైదరాబాద్, అక్టోబరు 27:

రాష్ట్రంలో బీసీ సంక్షేమ పథకాల అమలును మరింత వేగవంతం చేయడంతోపాటు పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ, విద్యా నిధికి సంబంధించిన అంశాలపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బీసీ ఆత్మగౌరవ భవనాలకు సంబంధించిన 38 జీవోల ప్రక్రియను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు.

1.90 లక్షల మంది మహిళలకు లబ్ధి

మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేసే పథకంపై మంత్రి ప్రత్యేకంగా సమీక్షించారు. ఈ పథకం కోసం ఇప్పటికే 4.80 లక్షల దరఖాస్తులు వచ్చినట్లు వెల్లడించారు. వీటిని పరిశీలించి అర్హులైన 1.90 లక్షల మంది మహిళలకు ప్రయోజనం చేకూరేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. డిసెంబర్ 9న కుట్టు మిషన్ల పంపిణీ చేపట్టేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ పథకం ద్వారా మహిళలకు స్వయం ఉపాధి



గ్రావిటీతో నీళ్లిస్తే రాజీనామా చేస్తా: ప్రభుత్వానికి హరీశ్‌రావు సవాల్

- తుమ్మిడిహెట్టి నుంచి గ్రావిటీతో నీళ్లు తెస్తే రాజీనామా చేస్తానన్న హరీశ్
- ప్రస్తుత కరవు కాంగ్రెస్ తెచ్చిన కరవు అని విమర్శ
- తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు డీపీఆర్‌ను బహిర్గతం చేయాలని డిమాండ్

తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టులపై అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరింది. తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లికి గ్రావిటీ ద్వారా నీటిని తరలించడం సాధ్యమని నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని, ఒకవేళ నిరూపించలేకపోతే నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాజీనామా చేస్తారా? అని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వానికి బహిరంగ సవాల్ విసిరారు. గ్రావిటీతో నీళ్లు వస్తాయని ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందని ఆయన మండిపడ్డారు. (మిగతా 2వ పేజీలో..)



కేటీఆర్, హరీశ్ రావు భ్రమల్లో ఉన్నారు: మహేశ్ గౌడ్

- వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 100 సీట్లు గెలుస్తుందని మహేశ్ గౌడ్ ధీమా
- తెలంగాణలో బీజేపీ పని అయిపోయిందని వ్యాఖ్య

ఆలోచన లేకుండా అప్పులు చేసి కేసీఆర్ రాష్ట్రాన్ని ముంచారని ఆరోపణ

బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావు ఇంకా భ్రమల్లోనే జీవిస్తున్నారని, క్షేత్రస్థాయి వాస్తవాలను వారు గ్రహించడం లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రంగా విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 100 సీట్లు గెలుచుకోవడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం (మిగతా 2వ పేజీలో..)

చెంబరంబాక్కం రిజర్వాయర్‌కు సీఎం విజయ్.. 2015 పునరావృతం కాకూడదని హెచ్చరిక!

- చెంబరంబాక్కం రిజర్వాయర్‌ను తనిఖీ చేసిన సీఎం విజయ్
- రిజర్వాయర్‌ను 24/7 పర్యవేక్షించాలని సూచన
- తుపాను ముప్పు నేపథ్యంలో అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశం

తమిళనాడులో (మిగతా 2వ పేజీలో..)



ఎస్ఐఆర్‌పై సుప్రీంకోర్టు విచారణ..



- రాహుల్ గాంధీ పోస్టులో ‘సత్యం శివం సుందరం’
- ‘సత్యం శివం సుందరం’ అనే పదాలను జోడించిన కాంగ్రెస్ అగ్రనేత
- ఓటర్ల జాబితా సవరణపై ప్రతిపక్షాల అభ్యంతరాలు
- ఎన్నికల సంఘం నిర్ణయాలపై న్యాయ సమీక్ష కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్
- ఎస్ఐఆర్ నిర్ణయాలు ఏకగ్రీవంగా తీసుకున్నామని ఎన్నికల సంఘం వాదన

ఓవైపు ఓటర్ల జాబితా సవరణపై రాజకీయ పోరు.. మరోవైపు సుప్రీంకోర్టులో కీలక విచారణ. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన ఓ సోషల్ మీడియా పోస్ట్ చర్చనీయాంశమైంది. ‘సత్యం శివం సుందరం’ అనే పదాలతో పాటు శివుడికి సంబంధించిన చిహ్నాన్ని ఆయన పంచుకున్నారు. ఎస్ఐఆర్‌పై పిటిషన్ల విచారణకు ముందు ఈ పోస్ట్ రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

(మిగతా 2వ పేజీలో..)

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

రాష్ట్రం పిచ్చోడి చేతిలో రాయిలా మారింది: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

చెప్పడాన్ని తప్పుబట్టారు.“రాష్ట్రం ప్రస్తుతం పిచ్చోడి చేతిలో రాయిలా మారింది. ఏ ఒక్క వర్గానికీ న్యాయం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది” అని కేటీఆర్ మండిపడ్డారు. రోమ్ నగరం తగలబడుతుంటే చక్రవర్తి ఫిడేల్ వాయించినట్టుగా, రాష్ట్రంలో కరవు ఉంటే ప్రభుత్వం మూసీ సుందరీకరణ పనులకు టెండర్లు పిలుస్తోందని ఎద్దేవా చేశారు. మరో ఏడాదిన్నరలో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని, ప్రజలు ఓపిక పట్టాలని కోరారు. అయితే కేటీఆర్ ఆరోపణలను కాంగ్రెస్ నేతలు ఖండించారు. కేటీఆర్ వి దొంగ కన్నీళ్లని, గోదావరి జలాలను వృథా చేయడం లేదని, ఇతర ఎత్తిపోతల పథకాల ద్వారా వినియోగిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు వద్ద నీటిమట్టం తక్కువగా ఉన్నందున పంపులను నడపడం సాధ్యం కాదని వారు స్పష్టం చేశారు.

గ్రావిటీతో నీళ్లిస్తే రాజీనామా చేస్తా: ప్రభుత్వానికి హరీశ్‌రావు సవాల్

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో నెలకొన్న కరవుకు ప్రభుత్వ వైఫల్యమే కారణమని హరీశ్ ఆరోపించారు. “ఇది కాలం తెచ్చిన కరవు కాదు. కాంగ్రెస్ తెచ్చిన కరవు” అని ఆయన వ్యాఖ్యానించారు. కృష్ణా, గోదావరిలో నీరు అందుబాటులో ఉన్నా ఎత్తిపోతలు చేపట్టకుండా ప్రభుత్వం రైతులను నష్టపరుస్తోందని విమర్శించారు. 33 శాతం వర్షపాతం లోటు ఉన్న ఏపీలో లేని క్రాప్ హాలిడే, కేవలం 17 శాతం లోటు ఉన్న తెలంగాణలో ఎందుకు ప్రకటించరని ప్రశ్నించారు.ప్రభుత్వం తక్షణమే మేడిగడ్డ బ్యారేజీకి మరమ్మతులు చేపట్టి, కన్నెపల్లి పంపుహౌస్ నుంచి నీటిని ఎత్తిపోయాలని డిమాండ్ చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి రూ.25 వేల కోట్లు ఖర్చు చేస్తామంటున్నారని, అసలు ఆ ప్రతిపాదనకు సంబంధించిన డీపీఆర్‌ను ఎందుకు బహిర్గతం చేయడం లేదని నిలదీశారు. తుమ్మిడిహెట్టి వద్ద తగినంత నీటి లభ్యత లేదని కేంద్ర జల సంఘం స్పష్టం చేసిన తర్వాతే, తమ ప్రభుత్వం మేడిగడ్డ వద్ద కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టిందని ఆయన గుర్తుచేశారు.

కేటీఆర్, హరీశ్ రావు భ్రమల్లో ఉన్నారు: మహేశ్ గౌడ్

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.మేధావి అని చెప్పుకునే కేసీఆర్ ఎలాంటి ఆలోచన లేకుండా అప్పులు చేశారని మహేశ్ గౌడ్ విమర్శించారు. ఎల్ నినో ప్రభావం దేశవ్యాప్తంగా ఉంటే, దాని గురించి హరీశ్ రావు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, 90,000 ఉద్యోగాలు పొందిన ప్రతి లబ్ధిదారుడు కాంగ్రెస్‌కే ఓటు వేస్తారని... క్షేత్రస్థాయిలో తమ పార్టీ బలంగా ఉందని చెప్పారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారని... దేశంలో ఎక్కడా లేనంతగా తమ పార్టీలో సమన్వయం ఉందని మహేశ్ గౌడ్ తెలిపారు. నవంబర్‌లో అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, ఆ తర్వాత తమ ప్రత్యక్ష లక్ష్యం ఎన్నికలేనని స్పష్టం చేశారు. రాబోయే కాలంలో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చే అవకాశమే లేదని, ఆ పార్టీ పని అయిపోయిందని జోస్యం చెప్పారు. ప్రస్తుతం ఉన్న 8 ఎంపీ సీట్లలో రెండు కూడా గెలవడం కష్టమేనని.. మరోవైపు, ఎనిమిది మంది ఎమ్మెల్యేలలో ఒక్కరు కూడా గెలవరని అన్నారు. ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో 40 శాతం సీట్లు తమకే వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

అర్ణబ్ ఎఫెక్ట్.. ఉత్తరాంధ్రలో పూర్తిగా మారిన వాతావరణం

(మొదటి పేజీ తరువాయి)

పశ్చిమమధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ‘అర్ణబ్’ అతి తీవ్ర తుపాను ఆంధ్రప్రదేశ్ తీరం వైపు వేగంగా దూసుకొస్తోంది. గడిచిన 6 గంటల్లో గంటకు 20 కిలోమీటర్ల వేగంతో కదులుతున్న ఈ తుపాను, ప్రస్తుతం విశాఖపట్నానికి 170 కి.మీ., కాకినాడకు 180 కి.మీ., మచిలీపట్నానికి 270 కి.మీ., బాపట్లకు 350 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉంది. దీని ప్రభావంతో ఉత్తర కోస్తా జిల్లాల్లో వాతావరణం పూర్తిగా మారిపోయింది.‘అర్ణబ్’ ప్రభావంతో ఇప్పటికే శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, విశాఖ, అనకాపల్లి, కోనసీమ జిల్లాల్లో వర్షాలు ప్రారంభమయ్యాయి. ఈరోజు సాయంత్రం నుంచి పోలవరం, కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.తుపాను రేపు (బుధవారం) ఉదయానికి బాపట్ల–విశాఖపట్నం మధ్య, యానాంకు సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. తీరం దాటే సమయంలో గంటకు 125 నుంచి 135 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ మాట్లాడుతూ, “తుపాను తీరం దాటే సమయంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలి. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలి” అని సూచించారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. అధికార యంత్రాంగం సహాయక చర్యల కోసం సర్వసన్నద్ధంగా ఉంది.

చెంబరంబాక్కం రిజర్వాయర్‌కు సీఎం విజయ్.. 2015 పునరావృతం కాకూడదని హెచ్చరిక!

(మొదటి పేజీ తరువాయి)

ఈశాన్య రుతుపవనాలు, తుపాను హెచ్చరికల నేపథ్యంలో ముఖ్యమంత్రి విజయ్ క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టారు. 2015 నాటి చెన్నై వరద విపత్తు పునరావృతం కాకుండా చూసేందుకు ఆయన చెన్నై శివారులోని చెంబరంబాక్కం రిజర్వాయర్‌ను స్వయంగా తనిఖీ చేశారు. నీటిమట్టం, ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.రిజర్వాయర్‌ను 24 గంటలూ పర్యవేక్షించాలని, నీటి విడుదల విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని విజయ్ ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, వరద ముంపునకు తావివ్వకుండా నీటిని దశలవారీగా నియంత్రిత పద్ధతిలో విడుదల చేయాలని సూచించారు. నీటిని విడుదల చేసే ముందు ప్రజలకు సమాచారం ఇవ్వడంతో పాటు, పోలీసు, రెవెన్యూ, చెన్నై నగర పాలక సంస్థలతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు.2015లో భారీ వర్షాల సమయంలో చెంబరంబాక్కం నుంచి అకస్మాత్తుగా నీటిని విడుదల చేయడం వల్లే చెన్నై నగరం ఘోర విపత్తును చవిచూసిందన్న విమర్శలున్నాయి. ఆ ఘటనలో 400 మందికి పైగా మరణించగా, లక్షలాది ఇళ్లు నీట మునిగాయి. ఈ నేపథ్యంలో సీఎం విజయ్ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ విషయంపై ‘తమిళగ వెట్రి కళగం’ (టీవీకే) ప్రతినిధి ఎం.సత్యకుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. “2015లో నాటి ముఖ్యమంత్రి జయలలిత అనుమతి కోసం అధికారులు ఆలస్యం చేయడం వల్లే విపత్తు సంభవించింది. అలాంటిది మళ్లీ జరగకూడదు. ముఖ్యమంత్రే స్వయంగా రిజర్వాయర్‌కు రావడం అధికారులకు బలమైన సందేశం. మాకు అధికారులపై నమ్మకం లేదు, ఆటలు ఆడవద్దని హెచ్చరిస్తున్నాం” అని ఆయన అన్నారు.

పెట్టుబడులే లక్ష్యం.. గ్లోబల్ సమ్మిట్‌కు భారీ ఏర్పాట్లు!

(మొదటి పేజీ తరువాయి)

పేరుతో రోడ్‌షోలు నిర్వహించారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల అవకాశాలను దేశీయ, అంతర్జాతీయ సంస్థలకు వివరించడమే ఈ కార్యక్రమాల ఉద్దేశం. 25 రంగాలుగా సమ్మిట్ వేదిక భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించే ప్రధాన సదస్సు వేదికను 25 రంగాలుగా విభజించారు. ఆయా రంగాలకు సంబంధించిన పెట్టుబడి అవకాశాలు, అభివృద్ధి ప్రణాళికలపై చర్చించేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్లీనరీ సమావేశాలు, సెమినార్లు, చర్చా కార్యక్రమాలతోపాటు పెట్టుబడి ఒప్పందాల కోసం ప్రత్యేక వేదికలను సిద్ధం చేస్తున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహించనున్నారు. ప్రతినిధులకు ప్రత్యేక ఏర్పాట్లు విదేశాల నుంచి వచ్చే ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రవాణా, వసతి సదుపాయాలను కల్పించనున్నారు. ప్రతి ప్రతినిధి బృందంతో సమన్వయం చేసుకునేందుకు సీనియర్ అధికారిని నోడల్ అధికారిగా నియమించనున్నారు. సదస్సుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. యువతకు ఉపాధి అవకాశాలే లక్ష్యం గ్లోబల్ సమ్మిట్ ద్వారా రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడంతోపాటు యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రధాన లక్ష్యమని సీఎస్ సంజయ్ జాజు పేర్కొన్నారు. కొత్త పరిశ్రమల స్థాపన, వివిధ రంగాల్లో వ్యాపార విస్తరణకు అవకాశాలు పెరిగితే ఉద్యోగాల కల్పనకు మార్గం సుగమమవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. సమ్మిట్ విజయవంతం కావడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఉన్నతాధికారులు దృష్టి సారించారు.

ఎల్‌నినో ముప్పు.. రెండో పంటకు దూరంగా ఉండండి!

(మొదటి పేజీ తరువాయి)

విజ్ఞప్తి చేశారు. రైతులు అనుభవజ్ఞులని, వాతావరణ పరిస్థితులను అంచనా వేసుకుని వ్యవసాయ నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ప్రతిపక్షాలు కూడా క్షేత్రస్థాయిలోని పరిస్థితులను రైతులకు వివరించాలని కోరారు. మంగళవారం సంగారెడ్డిలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి పర్యటించారు. జడ్పీ హాల్‌లో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా సమీక్షా సమావేశంలో మంత్రులు, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల కలెక్టర్లు, ఎంపీ రఘునందన్‌రావు, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. 900 గ్రామాల్లో భూ సర్వే చివరి దశ రాష్ట్రంలో భూముల రీ సర్వే ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసిందని పొంగులేటి తెలిపారు. సుమారు 125 ఏళ్ల క్రితం భూ సర్వే పూర్తికాగా, ప్రస్తుతం మరోసారి సర్వే నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఇప్పటివరకు 380 గ్రామాల్లో భూ సర్వే పూర్తయిందని, ఆయా గ్రామాల్లో భూ హక్కు పత్రాలను పంపిణీ చేసినట్లు చెప్పారు. మరో 900 గ్రామాల్లో సర్వే చివరి దశకు చేరుకుందని వెల్లడించారు. ఏడాదిన్నరలోపు తెలంగాణవ్యాప్తంగా భూ సర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. వివాదరహిత భూములే లక్ష్యం భూములకు సంబంధించిన వివాదాలను తగ్గించి, భవిష్యత్తు తరాలకు స్పష్టమైన హక్కులతో కూడిన భూములను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. గతంలోని ధరణి వ్యవస్థ స్థానంలో భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని చెప్పారు. ఆధార్ కార్డుల మాదిరిగానే భూములకు ప్రత్యేక గుర్తింపునిచ్చేలా ‘భూదార్’ విధానం ఉపయోగపడుతుందని వివరించారు. భూ రికార్డుల్లో పారదర్శకత పెంచడం, భూ యజమానుల హక్కులను పరిరక్షించడం ద్వారా సమస్యలకు పరిష్కారం చూపుతామని తెలిపారు. కేంద్రం నుంచి ఇళ్ల నిధుల్లో జాప్యం గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రావడంలో ఆలస్యం జరుగుతోందని పొంగులేటి అన్నారు. తాజాగా కేంద్రం రెండు లక్షల ఇళ్లను మంజూరు చేసిందని వెల్లడించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఆశించిన స్థాయిలో పేదలకు ఉపయోగపడలేదని విమర్శించారు. తమది ప్రజాప్రభుత్వమని, ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు అండగా ఉంటామని పేర్కొన్నారు. నిధుల కోసం అఖిలపక్షంతో ఢిల్లీకి తెలంగాణకు కేంద్రం నుంచి రావాల్సిన నిధుల అంశంపై చర్చించేందుకు బుధవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. అనంతరం అన్ని పార్టీల ప్రతినిధులతో కలిసి కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలవనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులను విడుదల చేయాలని కేంద్రాన్ని కోరుతామని చెప్పారు. ఈ విషయంలో రాజకీయాలకు అతీతంగా ప్రతిపక్షాలను కూడా కలుపుకొని ఢిల్లీకి వెళ్లేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

1.90 లక్షల మంది మహిళలకు కుట్టు మిషన్లు!

(మొదటి పేజీ తరువాయి)

అవకాశాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలి రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణలోని 327 గురుకులాల్లో కేవలం 26 పాఠశాలలకే సొంత భవనాలు ఉన్నాయని, మిగిలిన 301 గురుకులాలకు సొంత భవనాల నిర్మాణంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఇందుకోసం అవసరమైన స్థలాలను గుర్తించి, భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు మౌలిక సదుపాయాల అభివృద్ధి కీలకమని పేర్కొన్నారు. బీసీ స్టడీ సర్కిళ్లలో నాణ్యమైన శిక్షణ బీసీ స్టడీ సర్కిళ్ల పనితీరులో సంస్కరణలు చేపట్టాలని మంత్రి సూచించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు నాణ్యమైన శిక్షణ అందించడంతోపాటు ఉద్యోగాలు సాధించడమే లక్ష్యంగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. శిక్షణలో ప్రమాణాలు పెంచి, అభ్యర్థులకు అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని అధికారులకు సూచించారు. స్వయం ఉపాధికి ప్రత్యేక కార్యాచరణ బీసీ వర్గాలకు చెందిన ప్రజలకు స్వయం ఉపాధి అవకాశాలు పెంచేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. ముఖ్యంగా బీసీ వితంతువులు, ఒంటరి మహిళలకు ఉపాధి కల్పించే దిశగా నైపుణ్య శిక్షణ అందించేందుకు ప్రత్యేక కమిటీని నియమించాలని సూచించారు. శిక్షణ పొందిన మహిళలు స్వయంగా ఉపాధి పొందేలా అవసరమైన సహకారం అందించే అంశాలను పరిశీలించాలని తెలిపారు. ఆధునిక ధోబీఘాట్ల నిర్మాణానికి చర్యలు రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఆధునిక ధోబీఘాట్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. సంప్రదాయ వృత్తులపై ఆధారపడే బీసీ వర్గాలకు మెరుగైన సదుపాయాలు కల్పించడం ద్వారా వారి జీవనోపాధిని బలోపేతం చేయాలని సూచించారు. బీసీ సంక్షేమం, విద్య, ఉపాధి రంగాల్లో చేపట్టే కార్యక్రమాలు అర్హులకు సమర్థంగా చేరేలా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

ఎస్ఐఆర్‌పై సుప్రీంకోర్టు విచారణ..

(మొదటి పేజీ తరువాయి)

ఎస్ఐఆర్‌పై వివాదం ఏంటి?

ఓటర్ల జాబితాలో పేర్లను పరిశీలించి, అర్హులైన ఓటర్ల పేర్లు కొనసాగించడం, అనర్హుల పేర్లను తొలగించడం కోసం చేపట్టే ప్రక్రియే ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్). ఈ ప్రక్రియలో పెద్ద సంఖ్యలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించే ప్రమాదం ఉందని రాహుల్ గాంధీ, ఇతర ప్రతిపక్ష నేతలు ఆరోపిస్తున్నారు. ఎన్నికల సంఘం నిర్ణయాలపై న్యాయ సమీక్ష జరపాలని కోరుతూ వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే ఈ ఆరోపణలు ఇంకా న్యాయస్థానంలో విచారణలోనే ఉన్నాయి.

ఎన్నికల సంఘం ఏం చెప్పింది?

ఎస్ఐఆర్‌కు సంబంధించిన నిర్ణయాలన్నీ ఎన్నికల సంఘం ఏకగ్రీవంగానే తీసుకుందని కమిషన్ సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో తెలిపింది. మరోవైపు, ఈ నిర్ణయాలపై తమ అభ్యంతరాలను పరిశీలించాలని పిటిషనర్లు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు విచారణపై ఆసక్తి నెలకొంది.

‘బ్రేకింగ్ బ్యాడ్’ తర్వాత ఇప్పుడు ‘ప్రిజన్ బ్రేక్’: విజయ్ ప్రభుత్వంపై స్టాలిన్ విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

తేని జైలు నుంచి 17 మంది విచారణ ఖైదీలు పరారీ కావడంతో దుమారం
సీఎం విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వం చేతకానిదని స్టాలిన్ ఆరోపణ
ఇది 1995 తర్వాత జరిగిన అతిపెద్ద జైలు ఘటన అని వ్యాఖ్య

తమిళనాడులోని తేని జిల్లాలో జరిగిన జైలు ఘటనపై డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్, అధికార టీవీకే ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని ఆరోపిస్తూ, ప్రముఖ వెబ్ సిరీస్‌ల పేర్లతో విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో ‘బ్రేకింగ్ బ్యాడ్’ తర్వాత ఇప్పుడు ‘ప్రిజన్ బ్రేక్’ మొదలైందని ఆయన ఎద్దేవా చేశారు.తేని జిల్లాలోని తెక్కంపట్టి సబ్ జైలు నుంచి నిన్న రాత్రి 17 మంది విచారణ ఖైదీలు పరారైన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ నేపథ్యంలో స్పందించిన స్టాలిన్... సీఎం విజయ్ పరిపాలన వైఫల్యంపై విమర్శలు చేశారు. “బ్రేకింగ్ బ్యాడ్ తర్వాత ఇప్పుడు తమిళనాడులో ప్రిజన్ బ్రేక్ కూడా మొదలైంది. బెయిల్‌పై బయటకు వచ్చిన వారినే పర్యవేక్షించడం లేదనుకున్నా. కానీ ఈ చేతకాని ప్రభుత్వ హయాంలో జైళ్లలో ఉన్న ఖైదీలు కూడా సులభంగా తప్పించుకుంటున్నారు” అని ఆయన వ్యాఖ్యానించారు.1995 తర్వాత ఇంత పెద్ద సంఖ్యలో ఖైదీలు తప్పించుకోవడం ఇదే మొదటిసారని స్టాలిన్ గుర్తుచేశారు. ఈ ప్రభుత్వం ప్రజలను రక్షించలేదని, ప్రజలకు స్వీయరక్షణే శరణ్యమని ఆయన అన్నారు. ఇటీవల టీవీకే పార్టీ నేత ఒకరు నార్కోటిక్స్ కేసులో పట్టుబడినప్పుడు స్టాలిన్ ఆ పార్టీని ‘బ్రేకింగ్ బ్యాడ్ పార్టీ’ అని విమర్శించిన విషయం తెలిసిందే. తేని జైలు ఘటనలో, ఓ ఖైదీకి మూర్ఛ వచ్చిందని నమ్మించిన ఖైదీలు, సెల్‌లోకి వచ్చిన గార్డులపై దాడి చేసి పరారయ్యారు. ఈ ఘటన తర్వాత అప్రమత్తమైన పోలీసులు, పరారైన వారిని పట్టుకోవడానికి 17 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు నలుగురు ఖైదీలను తిరిగి అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనకు బాధ్యులుగా తొమ్మిది మంది జైలు సిబ్బందిని సస్పెండ్ చేశారు. ముఖ్యమంత్రి విజయ్ వద్దే హోం శాఖ ఉండటంతో, విపక్షాల విమర్శలకు ఆయన నేరుగా సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది.



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

అమరవీరుల త్యాగాలకు సెల్యూట్.. సూర్యాపేటలో పోలీసుల బైక్ ర్యాలీ

- జై జవాన్.. జై కిసాన్.. జై పోలీస్ నినాదాలతో మార్మోగిన నగరం
- చట్టాన్ని గౌరవించడమే అమరులకు నిజమైన నివాళి: ఎస్పీ నరసింహ ఐపీఎస్

సూర్యాపేట, అక్టోబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):

దేశ రక్షణలో, ప్రజల భద్రతలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ సూర్యాపేట జిల్లా కేంద్రంలో మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాల్లో భాగంగా జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీకి పట్టణ పౌరులు, యువత ఉత్సాహంగా తరలివచ్చారు.ఖమ్మం చౌరస్తా నుంచి ఎస్పీ నరసింహ అధికారులతో కలిసి ర్యాలీని ప్రారంభించారు. పీఎస్ఆర్ సెంటర్, కల్నల్ సంతోష్ బాబు చౌరస్తా, కోర్టు చౌరస్తా మీదుగా ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగింది. మార్గమంతా అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ సాగిన ఈ కార్యక్రమం ప్రజల్లో పోలీసుల సేవల పట్ల గౌరవాన్ని చాటింది.ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల చౌరస్తా వద్ద జై జవాన్.. జై కిసాన్.. జై పోలీస్ నినాదాలతో పాల్గొన్న వారిలో ఉత్సాహం నింపారు. పోలీసు అమరవీరుల ఆశయాలను సాధిస్తామని నినదిస్తూ వీరులకు ఘనంగా నివాళులర్పించారు.

చట్టాన్ని గౌరవించడమే నిజమైన నివాళి

ఈ సందర్భంగా ఎస్పీ నరసింహ ఐపీఎస్ మాట్లాడుతూ.. పోలీసు అమరవీరులు చేసిన అసమాన త్యాగాలను ప్రజలకు తెలియజేయడం, విధి నిర్వహణలో పోలీసులు ఎదుర్కొనే సవాళ్లు, కఠిన పరిస్థితులపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. అమరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ నిత్యం స్మరించుకోవాలని పిలుపునిచ్చారు.ప్రజల రక్షణ కోసం పోలీసులు నిరంతరం విధులు నిర్వర్తిస్తున్నారని, పోలీసుల





త్యాగాలకు గౌరవంగా ప్రతి పౌరుడు సత్ప్రవర్తనతో మెలుగుతూ చట్టపరిధిలో నడుచుకోవాలని సూచించారు. అమరవీరుల సేవలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచేలా సంస్మరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, ఆర్మ్డ్ డీఎస్పీ నరసింహ చారి, సీఐలు రాజశేఖర్, వెంకటయ్య, రామారావు, శివకుమార్, ఆర్ఐలు నారాయణ రాజు, ప్రవీణ్ కుమార్, జానయ్య, ఆర్ఎస్ఐ సురేష్, ఎస్ఐలు సందీప్, సాయిరాం, మహేష్, రహీముద్దిన్, కనకరత్నం, పోలీస్ సంఘం అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి కిరణ్, యువత, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండలో రూ.6 లక్షల విలువైన గంజాయి పట్టివేత

- 12 కిలోల ఎండు గంజాయి, 3 మొబైల్ ఫోన్లు స్వాధీనం
- పట్టుబడ్డ నిందితుడు మహారాష్ట్ర పోలీస్ కానిస్టేబుల్.. మరో ఇద్దరు పరారీ

నెక్కొండ, అక్టోబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):

వరంగల్ జిల్లా నెక్కొండ బస్టాండ్ సమీపంలో పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో భారీగా ఎండు గంజాయి పట్టుబడింది. సుమారు రూ.6 లక్షల విలువైన 12 కిలోల ఎండు గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో మహారాష్ట్రకు చెందిన ఓ పోలీస్ కానిస్టేబుల్ పట్టుబడగా, మరో ఇద్దరు వ్యక్తులు పరారైనట్లు సమాచారం.పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. పోలీసులను గమనించిన వారు అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించగా, ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు తప్పించుకున్నట్లు తెలిపారు.పట్టుబడ్డ వ్యక్తిని మహారాష్ట్రకు చెందిన పోలీస్ కానిస్టేబుల్ నితిన్ న్యాను షిండేగా గుర్తించినట్లు పోలీసులు వెల్లడించారు. అతడి వద్ద నుంచి 12 కిలోల ఎండు గంజాయితో పాటు మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయిని అక్రమంగా



తరలిస్తున్న క్రమంలో తనిఖీల్లో పట్టుబడినట్లు పోలీసులు తెలిపినట్లు సమాచారం. పరారైన మరో ఇద్దరి ఆచూకీ కోసం పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు తెలిసింది.

అమరుల స్ఫూర్తితో రక్తదానం.. 101 యూనిట్ల రక్తం సేకరణ





- పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో సేవా కార్యక్రమం
- స్వయంగా రక్తదానం చేసిన వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఐపీఎస్

వరంగల్, అక్టోబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో, రెడ్‌క్రాస్ సంస్థ సహకారంతో భీమారంలోని శుభం ఫంక్షన్ హాల్‌లో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో మొత్తం లి101 యూనిట్ల రక్తాన్ని సేకరించారు.లి అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ సేవా కార్యక్రమం మానవత్వానికి ప్రతీకగా నిలిచింది.ఈ శిబిరంలో వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ స్వయంగా రక్తదానం చేసి ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. పోలీస్ అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితుల్లో రక్తం ఎంతో విలువైనదని, రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని తెలిపారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి సామాజిక బాధ్యతను చాటుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజల ప్రాణరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, సమాజానికి మేలు చేసే సేవా కార్యక్రమాలు నిర్వహించడం స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, అదనపు డీసీపీలు సురేష్, వి. శ్రీనివాస్, ఏసీపీలు మధుసూదన్, నరసింహారావు, సత్యనారాయణ, ఏఆర్ ఏసీపీలు నాగయ్య, అనంతయ్య, సురేంద్రతో పాటు సీఐలు, ఎస్ఐలు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.అలాగే రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఇ.వి. శ్రీనివాస్ రావు, జిల్లా పాలక మండలి సభ్యులు కె. రాకేష్ రావు, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రికెట్‌కు ఏల్లవి ఎంపిక.. ఆర్థిక సాయం అందించిన జిల్లా ఎస్పీ

- క్రీడల్లో ప్రతిభ చూపే యువతను ప్రోత్సహిస్తాం: ఎస్పీ నరసింహ ఐపీఎస్

సూర్యాపేట, అక్టోబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):

సూర్యాపేట జిల్లాకు చెందిన పల్లవి తెలంగాణ రాష్ట్రం తరఫున జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక కావడం పట్ల జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ హర్షం వ్యక్తం చేశారు. ఆమెను ప్రోత్సహిస్తూ జిల్లా పోలీసు శాఖ తరఫున ఆర్థిక సహాయం అందించి అభినందించారు.కుడకుడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పల్లవి, 17 సంవత్సరాల బాలికల క్రికెట్ జట్టులో తెలంగాణ రాష్ట్రం తరఫున జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికైంది. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎంఎస్‌కే ప్రసాద్ క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న ఆమె, ఇటీవల నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి అర్హత సాధించింది.ఈ సందర్భంగా మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పల్లవికి ఎస్పీ నగదు సహాయం అందించి అభినందించారు. క్షేత్రస్థాయిలో ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించడంలో భాగంగా ఈ సహాయం అందించినట్లు తెలిపారు.ఎస్పీ నరసింహ మాట్లాడుతూ.. జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో పల్లవి అద్భుత ప్రతిభ కనబరిచి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లాకు, శిక్షణనిచ్చిన కోచ్‌లకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. క్రీడల్లో ప్రతిభ చూపే యువతను ప్రోత్సహించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. జాతీయ స్థాయికి ఎంపిక కావడం పల్లవి కృషి, పట్టుదలకు నిదర్శనమని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, వెల్ఫేర్ ఆర్ఎస్ఐ సాయిరాం, క్రికెట్ కోచ్‌లు పాల్గొన్నారు.



గోయగాంలో మిషన్ అమృత్ జల్ పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభం

- ప్రారంభించిన మంత్రి సీతక్క.. కార్యక్రమంలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క

కెరమెరి, అక్టోబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):



కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం గోయగాం గ్రామంలో మిషన్ అమృత్ జల్ పైలట్ ప్రాజెక్ట్ ను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క సోమవారం రాత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, ఎమ్మెల్సీ దండే విట్టల్ పాల్గొన్నారు.గ్రామీణ ప్రాంత ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించడం, అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపడం గ్రామీణాభివృద్ధిలో కీలకమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ లక్ష్యంతో గోయగాంలో పైలట్ ప్రాజెక్టును ప్రారంభించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్, ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఇరుకుల మంగ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కంచన్‌పల్లిలో ఆదివాసీల సమస్యలు తెలుసుకున్న దివ్య దేవరాజన్, ఆత్రం సుగుణక్క

- నిరుపేద కుటుంబాల ఆర్థిక అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

లింగాపూర్, అక్టోబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):



కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండలం కంచన్‌పల్లి గ్రామంలో ఆదివాసీ కుటుంబాల సమస్యలు, జీవనోపాధి అవసరాలను తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్, డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క సోమవారం రాత్రి అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ సమ్మిళిత జీవనోపాధుల కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారు కుటుంబాలతో వారు సమావేశమయ్యారు.తొలుత ఆదివాసీ సంప్రదాయం ప్రకారం గ్రామంలోని ఆదివాసీ దేవతలకు పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో నేలపై కూర్చొని వారి సమస్యలు, అవసరాలు, జీవన పరిస్థితులపై ఆరా తీశారు.ఈ సందర్భంగా దివ్య దేవరాజన్ మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబాల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తోందని వివరించారు. కుటుంబాలకు పోషకాహారం అందించడంతోపాటు ఆవులు, మేకల పెంపకం, వ్యవసాయం, నీటిపారుదల వంటి జీవనోపాధి అవకాశాలను ప్రోత్సహించే అంశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని, పిల్లల విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిరుపేదలు, ఆదివాసీ కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ వారి ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని, గ్రామీణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు, సర్పంచులు, గ్రామస్తులు, మహిళా సంఘాల సభ్యులు, ఆదివాసీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టును ఢీకొని కారులో చెలరేగిన మంటలు.. పూర్తిగా దగ్ధం

- అడవి పందిని తప్పించబోయి ప్రమాదం.. తృటిలో తప్పించుకున్న నలుగురు ప్రయాణికులు

భీమదేవరపల్లి, అక్టోబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):



హనుమకొండ జిల్లాలో అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అడవి పందిని తప్పించబోయిన కారు కల్వర్టును ఢీకొని మంటల్లో పూర్తిగా దగ్ధమైంది. అయితే కారులో ప్రయాణిస్తున్న నలుగురు ఎలాంటి గాయాలు లేకుండా బయటపడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.స్థానికుల వివరాల ప్రకారం.. పోతారం గ్రామానికి చెందిన అలువటి రఘు, పోతుగంటి అఖిల్ మరో ఇద్దరితో కలిసి హనుమకొండలో షాపింగ్ ముగించుకొని హుస్నాబాద్‌కు కారులో బయలుదేరారు. ఈ క్రమంలో గట్ల నర్సింగాపూర్--మంగళపల్లి మార్గంలో మంగళపల్లి సమీపంలో అకస్మాత్తుగా అడవి పంది ఎదురుకావడంతో దానిని తప్పించబోయి కారు కల్వర్టును ఢీకొట్టింది.ప్రమాదం జరిగిన వెంటనే కారులో మంటలు చెలరేగాయి. దీంతో ప్రయాణికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసినప్పటికీ, అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైంది.సమాచారం అందుకున్న బంగార పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.కారు పూర్తిగా కాలిపోయినా ప్రయాణికులు సురక్షితంగా బయటపడటంతో పెను ప్రమాదం తప్పినట్లయింది.

భారీ వర్షాల హెచ్చరిక.. సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు రేపు సెలవు

- 40 వేల బస్తాల ధాన్యం ఎగుమతి పెండింగ్.. రైతులు ధాన్యం తీసుకురావద్దు

సూర్యాపేట, అక్టోబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):

భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు బుధవారం (అక్టోబర్ 28) సెలవు ప్రకటించారు. మార్కెట్ యార్డులో ఇప్పటికే పెద్ద ఎత్తున ధాన్యం నిల్వలు ఉండటం, ఎగుమతులు పూర్తికాకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు కొప్పుల వేణా రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు.అక్టోబర్ 26న మార్కెట్ యార్డుకు 75 వేల బస్తాల ధాన్యం రాగా, వాటికి కాంటాలు పూర్తయ్యాయి. అయితే సుమారు 35 వేల బస్తాలు మాత్రమే ఎగుమతి కాగా, ఇంకా 40 వేల బస్తాల ధాన్యం ఎగుమతి కావాల్సి ఉందని మార్కెట్ కమిటీ వెల్లడించింది.ఆర్నాబ్ తుఫాన్ ప్రభావంతో మంగళవారం రాత్రి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న హెచ్చరికల నేపథ్యంలో యార్డులోని ధాన్యం తడవకుండా, నిల్వలను సురక్షితంగా తరలించేందుకు వీలుగా సెలవు ప్రకటించినట్లు పేర్కొన్నారు.కావున రైతులు, కమీషన్‌దారులు, వ్యాపారస్తులు ఈ విషయాన్ని గమనించి అక్టోబర్ 28న వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్ యార్డుకు తీసుకురావద్దని, మార్కెట్ కమిటీకి సహకరించాలని అధ్యక్షుడు కొప్పుల వేణా రెడ్డి కోరారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

రోడ్డు ప్రమాదంలో గాయపడిన తమ్మిశెట్టి జయరాంకు పరామర్శ

ఇంటికి వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న ఒంటెద్దు నరసింహా రెడ్డి

హుజూర్‌నగర్, అక్టోబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):



హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన తమ్మిశెట్టి జయరాం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు శ్రీ ఒంటెద్దు నరసింహా రెడ్డి మంగళవారం ఆయనను పరామర్శించారు. జయరాం నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ప్రమాదంలో గాయపడిన జయరాంకు ధైర్యం చెబుతూ, ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఆపద సమయంలో బాధితులను పరామర్శించి అండగా నిలవడం మానవీయ బాధ్యతగా నాయకులు పేర్కొన్నారు.ఈ పరామర్శ కార్యక్రమంలో హుజూర్‌నగర్ మాజీ జడ్పీటీసీ, నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు కొప్పుల సైదిరెడ్డి, సీనియర్ నాయకులు డాక్టర్ కేఎల్ఎన్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వరరావు, హుజూర్‌నగర్ పట్టణ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ అమర్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు పచ్చిపాల ఉపేందర్, వీరమళ్ల సుందరయ్య, వేముల అఖిల్, కారింగుల చొక్కయ్య, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనగణనలో తప్పులకు తావులేకుండా పక్కాగా వివరాల సేకరణ చేపట్టాలి





- **ప్రజలు సరైన సమాచారం ఇచ్చి ఎన్యూమరేటర్లకు సహకరించాలి**
- **40 రకాల ప్రశ్నలతో జనగణన.. జనవరి 10 నుంచి స్వీయ గణన ప్రారంభం**
- **అధికారులకు రెండో విడత శిక్షణలో కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ దిశానిర్దేశం**

సూర్యాపేట, అక్టోబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):

జనాభా గణన దేశ భవిష్యత్ ప్రణాళికలకు కీలక ఆధారమని, ఈ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా కచ్చితమైన వివరాలు సేకరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. జనగణన విజయవంతానికి అధికారులు సమన్వయంతో పనిచేయడంతోపాటు ప్రజలు కూడా ఎన్యూమరేటర్లకు సరైన సమాచారం అందించి సహకరించాలని పిలుపునిచ్చారు.జనగణన రెండో దశ నిర్వహణకు సంబంధించి మంగళవారం సూర్యాపేట కలెక్టరేట్ సమావేశ మందిరంలో ముఖ్య ప్రణాళిక అధికారి ఆధ్వర్యంలో జిల్లా, డివిజనల్ స్థాయి అధికారులు, ఛార్జ్ అధికారులు, అదనపు ఛార్జ్ అధికారులకు రెండో విడత శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ జనగణన షెడ్యూల్, విధివిధానాలు, క్షేత్రస్థాయిలో అధికారుల బాధ్యతలపై వివరించారు. జనవరి 10 నుంచి స్వీయ గణన.. 25 నుంచి ఇంటింటి సర్వే 2027 జనవరి 10 నుంచి ఫిబ్రవరి 28 వరకు జనగణన రెండో దశ నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను వెల్లడించారు.

స్వీయ గణన: జనవరి 10 నుంచి జనవరి 24, 2027 వరకు.

జనగణన: జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28, 2027 వరకు.

ఇళ్లు లేని వారి గణన: ఫిబ్రవరి 28 రాత్రి.

రివిజనల్ రౌండ్: మార్చి 1 నుంచి మార్చి 5, 2027 వరకు.

40 రకాల వివరాల సేకరణ

జనగణనలో భాగంగా ఎన్యూమరేటర్లు ప్రతి గృహ యజమానిని సంప్రదించి మొత్తం 40 రకాల ప్రశ్నలకు సంబంధించిన వివరాలను సేకరిస్తారని కలెక్టర్ వివరించారు. ప్రజలు అడిగిన ప్రశ్నలకు వాస్తవమైన, సరైన సమాచారం అందించాలని కోరారు. కచ్చితమైన జనాభా గణనతో భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలకు అవసరమైన సమాచారం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు.జనగణన విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని, నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో సమన్వయం, పర్యవేక్షణతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించడంపై దృష్టి సారించాలని స్పష్టం చేశారు.ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, సీపీఓ కిషన్, జడ్పీ సీఈఓ శిరీష, ఆర్డీవోలు వేణుమాధవ్, శ్రీనివాసులు, సూర్యనారాయణ, ట్రైనర్లు ఓబులాల్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులూ.. మూడు రోజులు వరి కోతలు వాయిదా వేసుకోండి!

ఆర్నాబ్ తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాల సూచన

ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట, అక్టోబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):



ఆర్నాబ్ తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు మూడు రోజుల పాటు వరి కోతలను వాయిదా వేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. వర్షాలకు కోసిన ధాన్యం తడిస్తే తేమ శాతం పెరిగి నాణ్యత దెబ్బతినడంతో పాటు రైతులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించే వరకు వరి కోతలు చేపట్టవద్దని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు.

కోసిన ధాన్యాన్ని కాపాడుకోండి

ఇప్పటికే వరి కోతలు పూర్తిచేసిన రైతులు ధాన్యం వర్షానికి తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ధాన్యాన్ని సురక్షిత ప్రదేశాల్లో నిల్వ ఉంచి, టార్పాలిన్లు, ఇతర కవర్లతో పూర్తిగా కప్పి భద్రపరచుకోవాలని తెలిపారు. గ్రామాల్లో రైతులకు అవగాహన వ్యవసాయ శాఖ క్షేత్రస్థాయి అధికారులు గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తూ, పంటలు వర్షాలకు తడవకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేస్తున్నారని వెల్లడించారు. సామాజిక మాధ్యమాల ద్వారా కూడా విస్తృతంగా సమాచారం అందిస్తామని పేర్కొన్నారు.రైతులు వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలని, ముందస్తు జాగ్రత్తలతో పంట నష్టాన్ని నివారించుకోవాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కోరారు.

దీపావళి రద్దీకి ప్రత్యేక రైళ్లు.. వరంగల్ మీదుగా తిరువనంతపురం--నిజాముద్దీన్ సర్వీసులు

నవంబర్ 2 నుంచి ప్రత్యేక రైళ్ల రాకపోకలు.. ప్రయాణికులకు ఊరట

హనుమకొండ, అక్టోబర్ 27 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి):



దీపావళి పండుగ నేపథ్యంలో రైళ్లలో పెరగనున్న ప్రయాణికుల రద్దీని నియంత్రించేందుకు రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లను నడపనుంది. తిరువనంతపురం నార్త్--హజ్రత్ నిజాముద్దీన్ మధ్య వరంగల్ మీదుగా ప్రత్యేక రైలు సర్వీసులను ఏర్పాటు చేసినట్లు ప్రకటించింది.రైల్వే శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. రైలు నంబర్ 06073 నవంబర్ 2 నుంచి 16వ తేదీ వరకు, రైలు నంబర్ 06074 నవంబర్ 5 నుంచి 19వ తేదీ వరకు నడపనున్నాయి. ఈ ప్రత్యేక సర్వీసులతో పండుగ సీజన్‌లో సొంతూళ్లకు, ఇతర ప్రాంతాలకు ప్రయాణించే వారికి అదనపు రవాణా సదుపాయం అందనుంది.పండుగ సమయంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని చేపట్టిన ఈ ఏర్పాట్లను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. రైళ్ల పూర్తి టైమ్‌టేబుల్, వరంగల్ స్టేషన్‌లో రాకపోకల సమయాలు, నిలుపుదల వివరాలను అధికారిక రైల్వే సమాచారంలో పరిశీలించి ప్రయాణాన్ని ప్లాన్ చేసుకోవాలని సూచిస్తున్నారు.

ఏనుమాముల మార్కెట్లో పసుపుకు రికార్డు ధర.. క్వింటాలుకు రూ.19,089

హనుమకొండ, అక్టోబర్ 27 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి):

వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో పసుపు ధర రైతుల్లో ఆనందం నింపింది. మంగళవారం మార్కెట్లో జరిగిన క్రయవిక్రయాల్లో పసుపు క్వింటాలుకు గరిష్ఠంగా రూ.19,089 ధర పలికింది. దీంతో పసుపు రైతులకు మంచి ధర లభించినట్లయింది.ఈ ఏడాది మార్కెట్లో నమోదైన అత్యధిక ధర ఇదేనని అధికారులు, రైతులు పేర్కొంటున్నారు. నాణ్యమైన పసుపు దిగుబడికి ఆశాజనకమైన ధర లభించడంతో మార్కెట్‌కు పంటను తీసుకొచ్చిన రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పసుపుకు మంచి ధర లభించడంతో సాగు ఖర్చులు, పెట్టుబడుల భారాన్ని కొంతవరకైనా అధిగమించవచ్చని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ ధర గరిష్ఠ ధర మాత్రమేనని, పసుపు నాణ్యత, రకాన్ని బట్టి రైతులకు లభించే ధరల్లో వ్యత్యాసం ఉండవచ్చని గమనించాలి.



ఎండల తీవ్రత దృష్ట్యా నీటి నిల్వలపై దృష్టి సారించాలి

- **ఉపాధి హామీ పనుల్లో నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి**
- **రాయినిగూడెంలో మొక్కల పెంపకం, నీటి నిల్వల నిర్మాణాలపై పర్యవేక్షణ**

సూర్యాపేట, అక్టోబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):

ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో గ్రామాల్లో నీటి సంరక్షణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, వర్షపు నీటిని ఒడిసిపట్టి భవిష్యత్ అవసరాలకు వినియోగించుకునేలా నీటి నిల్వలపై దృష్టి సారించాలని సూర్యాపేట జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గుండు రామాంజి గౌడ్ సూచించారు. ఉపాధి హామీ పనుల్లో భాగంగా నీటి సంరక్షణ చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.రాయినిగూడెం గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన మొక్కల పెంపకం పనులను మండల స్పెషల్ ఆఫీసర్ పార్థసారథి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఎండల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో మొక్కల సంరక్షణ, నీటి వినియోగంపై ఉపాధి హామీ కూలీలకు అవగాహన కల్పించారు. నీటిని వృథా చేయకుండా నిల్వ చేసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు.ఈ సందర్భంగా సర్పంచ్ గుండు రామాంజి గౌడ్ మాట్లాడుతూ.. గ్రామంలో నీటి కొరత తీవ్రతరం కాకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామంలో ఊరుకుంటలు, వ్యవసాయ పొలాల్లో ఫామ్ పాండ్లు, బోర్‌వెల్ రీచార్జి నిర్మాణాలు వంటి నీటి నిల్వ, సంరక్షణ పనులపై దృష్టి సారించాలని సూచించారు. వర్షపు నీటిని సమర్థవంతంగా ఒడిసిపట్టడం ద్వారా భూగర్భ జలాల పెంపునకు, వ్యవసాయ అవసరాలకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు.మొక్కల పెంపకంతో పాటు వాటి సంరక్షణకు అవసరమైన నీటి నిర్వహణ చేపట్టాలని, ఉపాధి హామీ పనులను గ్రామాభివృద్ధికి, ప్రకృతి వనరుల పరిరక్షణకు ఉపయోగించుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.ఈ కార్యక్రమంలో ఏపీవో సురేష్, గ్రామ కార్యదర్శి సునీత, ఉపసర్పంచ్ నాగరాజు, మేటు శ్రీకాంత్, నియోజకవర్గ యువజన నాయకుడు గుండు నరేష్, గుండు చిన్నమట్టయ్య, మమత, పద్మ, నాగమణి, గోపయ్య, వెంకన్న, సతీష్, హనుమంతు, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.



సామాజిక సేవలో యువత భాగస్వామ్యం కీలకం

- **'టీబీ ముక్త్ భారత్' వంటి కార్యక్రమాల్లో యువత చురుకైన పాత్ర పోషించాలి: కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**
- **యూత్ హాస్టల్‌లో మౌలిక వసతుల మెరుగుదలకు చర్యలు**

హనుమకొండ, అక్టోబర్ 27 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి):

సామాజిక సేవా కార్యక్రమాల విజయవంతంలో యువత పాత్ర కీలకమని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. 'టీబీ ముక్త్ భారత్' వంటి సామాజిక సంక్షేమ కార్యక్రమాల్లో యువత పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు.మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 'మై భారత్' కోఆర్డినేటర్లు, జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యువత నమోదు ప్రక్రియ, సేవా కార్యక్రమాల ప్రణాళికలు, వాటి అమలు తీరుపై సమీక్షించారు. యువత సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు.హనుమకొండలోని యూత్ హాస్టల్‌లో యువతకు మెరుగైన సదుపాయాలు కల్పించే దిశగా అవసరమైన మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. శిక్షణ కోసం జిల్లాకు వచ్చే యువత, అధికారులు స్థానిక చారిత్రక వారసత్వ సంపదను సందర్శించాలని సూచించారు.ముఖ్యంగా కాకతీయుల కాలం నాటి చారిత్రక కట్టడాలను సందర్శించి వాటి విశిష్టత, చారిత్రక నేపథ్యం, సాంస్కృతిక ప్రాధాన్యతను తెలుసుకోవాలని పేర్కొన్నారు. యువతలో సేవాభావంతో పాటు చరిత్ర, సంస్కృతి పట్ల అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు.



ఐపఎల్ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలి

- **కోదాడలో రాష్ట్ర కౌన్సిల్ సమావేశం, న్యాయవాదుల సెమినార్ నిర్వహణకు నిర్ణయం**
- **జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో కీలక తీర్మానాలు**

సూర్యాపేట, అక్టోబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):

జిల్లావ్యాప్తంగా ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేసి, సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని ఐఏఎల్ జిల్లా అధ్యక్షులు బొమ్మగాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. న్యాయవాదుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం ఐక్యంగా కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించిన ఐఏఎల్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. జిల్లాలోని న్యాయవాదులను సంఘంలో భాగస్వాములను చేస్తూ సభ్యత్వ నమోదు ప్రక్రియను విస్తృతంగా చేపట్టాలని సమావేశం తీర్మానించింది. అలాగే, కోదాడలో ఐఏఎల్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంతో పాటు న్యాయవాదుల సెమినార్ నిర్వహించాలని నిర్ణయించింది.ఈ సందర్భంగా న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలు, వృత్తిపరమైన సవాళ్లు, న్యాయవాదుల రక్షణ చట్టం ఆవశ్యకత, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై చర్చించేందుకు కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు. ముఖ్యంగా జూనియర్ న్యాయవాదుల సంక్షేమం, వృత్తిపరమైన భద్రత, న్యాయవాదుల హక్కుల సాధనకు సంఘం నిరంతరం కృషి చేయాలని సమావేశంలో అభిప్రాయపడ్డారు.జిల్లావ్యాప్తంగా ఐఏఎల్ కార్యకలాపాలను విస్తరించి, న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి సమిష్టిగా ముందుకు సాగాలని, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయడంతో పాటు కోదాడలో రాష్ట్ర కౌన్సిల్ సమావేశం, సెమినార్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై దృష్టి సారించాలని తీర్మానించారు.ఈ సమావేశంలో ఐఏఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొగిటి మురళి, గౌరవ అధ్యక్షులు నాతి సవేందర్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు గట్ల నరసింహారావు, కంచర్ల సతీష్ కుమార్, కార్యదర్శి దొరపెల్లి రమేష్, సీనియర్ ఐఏఎల్ నాయకులు పెండెం వాణి, యరగాని వెంకటేశ్వర్లు, వి.దయాకర్ రావు తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

భీమదేవరపల్లి జనరల్ బాడీ సమావేశంలో సర్పంచుల గలాటా!

- **ఇందిరమ్మ ఇళ్ల జాబితా, ఎస్‌డీఎఫ్ నిధుల కేటాయింపుపై వాడీవేడి చర్చ**
- **అధికార పార్టీ సర్పంచులు -- ఇతర సర్పంచుల మధ్య వాగ్వాదం.. ఎంపీడీవో బదిలీకి వినతిలి**



భీమదేవరపల్లి, అక్టోబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):

గ్రామాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై చర్చించాల్సిన జనరల్ బాడీ సమావేశం వాడీవేడి వాదోపవాదాలకు వేదికైంది. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితా, ఎస్‌డీఎఫ్ నిధుల కేటాయింపు అంశాలపై అధికార పార్టీ సర్పంచులు, ఇతర సర్పంచుల మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. దీంతో సమావేశం ఒక్కసారిగా చర్చనీయాంశంగా మారింది.

సర్పంచులకు సమాచారం లేకుండానే ఇందిరమ్మ ఇళ్ల పరిశీలనా?

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితా పరిశీలన చేపట్టే ముందు గ్రామ సర్పంచులకు సమాచారం ఇవ్వకపోవడంపై పలువురు సర్పంచులు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది. గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధులకు తెలియకుండా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఎలా చేపడతారని ప్రశ్నించినట్లు సమాచారం. సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పాటించాలని, గ్రామ ప్రజాప్రతినిధులకు తగిన సమాచారం అందించాలని వారు కోరినట్లు తెలిసింది.

ఎస్‌డీఎఫ్ నిధుల కేటాయింపుపై అభ్యంతరాలు

ఎస్‌డీఎఫ్ నిధులను అధికార పార్టీ కార్యకర్తలకు కేటాయించాలన్నట్లు ఎంపీడీవో చెప్పడంపై సర్పంచులు ప్రశ్నించినట్లు సమాచారం. అభివృద్ధి నిధుల పంపిణీలో రాజకీయాలకు తావులేకుండా గ్రామాల అవసరాలు, ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాలని వారు డిమాండ్ చేసినట్లు తెలిసింది. ఈ అంశంపై సమావేశంలో తీవ్రస్థాయిలో చర్చ జరిగినట్లు సమాచారం.

ఎంపీడీవో బదిలీకి వినతి

సమావేశంలో చోటుచేసుకున్న పరిణామాలపై అసంతృప్తి వ్యక్తం చేసిన పలువురు సర్పంచులు, ఎంపీడీవోను బదిలీ చేయాలని కోరుతూ ప్రత్యేక అధికారికి వినతిపత్రం సమర్పించినట్లు తెలిసింది.


అధికారుల వివరణపై ఆసక్తి

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, ఎస్‌డీఎఫ్ నిధుల కేటాయింపు వ్యవహారాలు మండల రాజకీయాల్లో చర్చకు దారితీశాయి. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో పారదర్శకతతో పాటు గ్రామ ప్రజాప్రతినిధులకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలనే డిమాండ్ ఈ సమావేశం ద్వారా తెరపైకి వచ్చింది. అయితే సర్పంచులు చేసిన ఆరోపణలపై ఎంపీడీవో వివరణ, సంబంధిత అధికారుల అధికారిక స్పందన తెలియాల్సి ఉంది.

సహకార సంఘాల బలోపేతానికి పెద్దపీట

- **ప్రతి సొసైటీకి రూ.10 లక్షల కొత్త పంట రుణాలు.. డీసీసీబీ కీలక నిర్ణయం**
- **రూ.10.23 కోట్ల నికర లాభం.. సభ్య సొసైటీలకు రూ.1.53 కోట్ల డివిడెండ్ ప్రకటన**

హనుమకొండ, అక్టోబర్ 27 (ప్రజానేస్తం జ్వాల ప్రతినిధి):



రైతులకు మరింత రుణ సదుపాయం కల్పించడంతో పాటు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను బలోపేతం చేసే దిశగా వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) కీలక నిర్ణయాలు తీసుకుంది. ఉమ్మడి జిల్లా పరిధిలోని ప్రతి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి (పీఏసీఎస్) కొత్తగా రూ. 10 లక్షల పంట రుణాలను కేటాయించనున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్, వరంగల్ డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కమిటీ అధ్యక్షురాలు చాహత్ బాజ్‌పాయ్ వెల్లడించారు.మంగళవారం నిర్వహించిన డీసీసీబీ మహాజనసభలో ఆమె మాట్లాడుతూ.. రైతులకు ప్రయోజనం చేకూర్చేలా సహకార సంఘాల ద్వారా రుణ సదుపాయాలను విస్తరించనున్నట్లు తెలిపారు. సహకార సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావడంతో పాటు రైతులకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.2025-26 ఆర్థిక సంవత్సరంలో డీసీసీ బ్యాంకు రూ.10.23 కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ లాభాల్లో భాగంగా సభ్య సహకార సంఘాలకు రూ.1.53 కోట్ల డివిడెండ్‌ను ప్రకటించినట్లు తెలిపారు. అర్హతలు కలిగిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు వ్యాపార విస్తరణ కోసం రూ.50 లక్షల వరకు దీర్ఘకాలిక రుణాలు సైతం మంజూరు చేయనున్నట్లు స్పష్టం చేశారు.పంట రుణాల కేటాయింపు, డివిడెండ్ ప్రకటన, దీర్ఘకాలిక రుణాల సదుపాయాలతో సహకార రంగానికి మరింత ఊతం లభించనుందని, తద్వారా రైతులకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.

విద్యార్థుల సమగ్ర వికాసానికి క్రీడలు దోహదం

- **క్రీడలతో క్రమ-శిక్షణ, ఆత్మవిశ్వాసం, పోటీతత్వం పెంపు: కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం**
- **హనుమకొండలో అంతర్ కళాశాలల క్రీడా పోటీలు ప్రారంభం**



ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, వివిధ విభాగాల పీడీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

హనుమకొండ, అక్టోబర్ 27 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి):

విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, పోటీతత్వం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం అన్నారు. చదువుతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యతనిస్తూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు.మంగళవారం హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన అంతర్ కళాశాలల క్రీడా పోటీలను ఆచార్య వి.రామచంద్రం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, జట్టుగా పనిచేసే తత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. క్రీడా పోటీల్లో గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ, అనుభవాల నుంచి నేర్చుకోవాలని తెలిపారు.యువత విద్యతో పాటు క్రీడల్లోనూ తమ ప్రతిభను చాటుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడంతో పాటు వ్యక్తిత్వ వికాసానికి అవకాశం కలుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో కేయూ ఓఎస్డీ ఆచార్య వెంకట్రామిరెడ్డి,

పోక్సో చట్టంపై ప్రతి విద్యార్థికి అవగాహన అవసరం

- **బాలలపై వేధింపులుంటే భయపడొద్దు.. 1098 లేదా 112కు సమాచారం ఇవ్వండి: సివిల్ జడ్జి హైమ పూజిత**
- **సైబర్ భద్రతపై అప్రమత్తంగా ఉండాలి: అవగాహన సదస్సులో సూచన**



ఆన్‌లైన్‌లో అపరిచితులతో వ్యక్తిగత వివరాలు పంచుకోకూడదని, అనుమానాస్పద లింకులు తెరవకూడదని, సోషల్ మీడియాను జాగ్రత్తగా వినియోగించాలని వివరించారు. బాలల రక్షణ, భద్రతపై విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉంటూ, పిల్లలకు సురక్షిత వాతావరణం కల్పించాలని కార్యక్రమంలో సూచించారు.

హనుమకొండ, అక్టోబర్ 27 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి):

బాలలపై లైంగిక వేధింపులు, నేరాల నివారణకు ప్రతి విద్యార్థి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సివిల్ జడ్జి హైమ పూజిత సూచించారు. పిల్లల భద్రత, హక్కుల పరిరక్షణపై అవగాహన పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు.హనుమకొండ సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాలలపై లైంగిక నేరాల నివారణపై ప్రత్యేక న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సివిల్ జడ్జి హైమ పూజిత విద్యార్థులకు పోక్సో (ఫ్రూజూ) చట్టంపై అవగాహన కల్పించారు. బాలలపై లైంగిక నేరాలను నిరోధించేందుకు చట్టం కల్పిస్తున్న రక్షణలు, తమ హక్కుల గురించి విద్యార్థులు తెలుసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ అధికారి రమేష్ మాట్లాడుతూ.. ఎవరైనా వేధింపులకు గురిచేస్తున్నా, బాలలపై అనుమానాస్పద వేధింపులు లేదా దాడులు జరిగినట్లు తెలిసినా భయపడకుండా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. ఇందుకోసం చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 లేదా అత్యవసర సహాయ నంబర్ 112ను సంప్రదించాలని సూచించారు.అనంతరం విద్యార్థులకు సైబర్ భద్రతపై అవగాహన కల్పిస్తూ,

ఏనుమాముల మార్కెట్లో మిర్చి ధరల మంట.. టమాటా మిర్చి క్వింటాలు రూ.38 వేలు!

ఒక్కరోజులో రూ.5 వేలు పెరిగిన టమాటా మిర్చి ధర.. పత్తి, ఇతర రకాల మిర్చికీ పెరిగిన రేట్లు

హనుమకొండ, అక్టోబర్ 27 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి):

వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో మిర్చి ధరలు ఒక్కసారిగా పుంజుకున్నాయి. మంగళవారం జరిగిన క్రయవిక్రయాల్లో టమాటా మిర్చి క్వింటాలుకు ఏకంగా రూ. 38 వేల ధర పలికి అందరి దృష్టిని ఆకర్షించింది. సోమవారం రూ. 33 వేలుగా ఉన్న ధర ఒక్కరోజులోనే రూ. 5 వేలు పెరగడంతో మిర్చి రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.మార్కెట్ వర్గాల వివరాల ప్రకారం.. పత్తి, వివిధ రకాల మిర్చికి కూడా ఆశాజనకమైన ధరలు లభించాయి. క్వింటా పత్తి ధర సోమవారం రూ.8,950 ఉండగా, మంగళవారం రూ.9,070కు చేరింది. తేజ మిర్చి ధర రూ.23 వేల నుంచి రూ.23,300కు పెరిగింది. 341 రకం మిర్చి రూ.26,400 నుంచి రూ.26,500కు చేరింది. ఇక వండర్ హాట్ (ఔని) మిర్చి క్వింటాలుకు రూ.31 వేల ధర పలికింది. ముఖ్యంగా టమాటా మిర్చి ధరలో నమోదైన భారీ పెరుగుదల మార్కెట్లో ప్రత్యేక చర్చనీయాంశంగా మారింది.పంటకు మంచి ధర లభించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సాగు పెట్టుబడులు, కూలీ ఖర్చులు పెరిగిన నేపథ్యంలో మార్కెట్లో లభిస్తున్న ధరలు కొంత ఊరటనిస్తున్నాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.అయితే ఇవి మార్కెట్లో నమోదైన ధరల వివరాలు మాత్రమే. గరిష్ట ధరలు, సాధారణ విక్రయ ధరలు వేర్వేరుగా ఉండే అవకాశం ఉంది. పంట నాణ్యత, రకం, గిరాకీని బట్టి రైతులకు లభించే ధరల్లో మార్పులు ఉండవచ్చు.



సీతాఫలం.. ఆరోగ్యానికి మేలు

- **విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్‌కు మంచి వనరు.. మితంగా తీసుకోవాలని సూచన**

హనుమకొండ, అక్టోబర్ 27 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి):



ప్రకృతి ప్రసాదించిన రుచికరమైన పండ్లలో సీతాఫలం ఒకటి. ప్రస్తుతం మార్కెట్లలో విరివిగా లభిస్తున్న ఈ పండులో పలు పోషకాలు ఉండటంతో సమతుల ఆహారంలో భాగంగా తీసుకోవచ్చని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. తీపి రుచితో పాటు శరీరానికి అవసరమైన శక్తిని అందించే ఈ పండు పట్ల వినియోగదారులు ఆసక్తి చూపుతున్నారు.సీతాఫలంలో కార్బోహైడ్రేట్లు, పీచు పదార్థం (ఫైబర్), విటమిన్ సి, పొటాషియం తదితర పోషకాలు ఉంటాయి. పీచు పదార్థం జీర్ణక్రియకు తోడ్పడుతుంది. విటమిన్ సి శరీర రోగనిరోధక వ్యవస్థ సాధారణ పనితీరుకు సహాయపడుతుంది. ఇందులోని కార్బోహైడ్రేట్లు శరీరానికి శక్తిని అందిస్తాయి.అయితే సీతాఫలం తినడం వల్లనే హిమోగ్లోబిన్ గణనీయంగా పెరుగుతుందని, బీపీ, మధుమేహం లేదా మానసిక ఒత్తిడి నియంత్రణలోకి వస్తాయని చెప్పడానికి తగిన ఆధారాలు లేవు. అలాగే గుండె జబ్బులకు చికిత్సగా దీనిని భావించకూడదు. సీతాఫలం ఆరోగ్యకరమైన ఆహారంలో భాగమే తప్ప, వ్యాధులకు మందు కాదు.సీతాఫలం సహజంగా తీపి కలిగిన పండు కావడంతో మధుమేహం ఉన్నవారు పరిమాణంపై శ్రద్ధ వహించాలి. వ్యక్తిగత ఆహార నియమాలకు అనుగుణంగా తీసుకోవడం మంచిది. పండును శుభ్రంగా కడిగి, గింజలను పూర్తిగా తొలగించి గుజ్జును మాత్రమే తీసుకోవాలి. సీతాఫలం గింజలను నమలడం లేదా పొడి చేయడం నివారించాలి. రుచితో పాటు పోషకాలను అందించే సీతాఫలాన్ని మితంగా తీసుకుంటూ, ఇతర పండ్లు, కూరగాయలతో కూడిన సమతుల ఆహారానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచిస్తున్నారు.

హాస్టళ్ల మూసివేత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

- **ఎఫ్ఆర్ఎస్ హాజరు పేరుతో విద్యార్థులకు అన్యాయం చేయొద్దు**
- **నిత్యావసర సరుకుల సరఫరా సమస్యను వెంటనే పరిష్కరించాలి: పీడీఎస్‌యూ**



హనుమకొండ, అక్టోబర్ 27 (ప్రజానేస్తం జ్వాల ప్రతినిధి):

ఎఫ్ఆర్ఎస్ (FRS) హాజరు పేరిట సంక్షేమ హాస్టళ్లను మూసివేసే చర్యలను తక్షణమే నిలిపివేయాలని పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌కు వినతిపత్రం అందజేసింది.ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మర్రి మహేష్ మాట్లాడుతూ.. విద్యార్థుల హాజరు నమోదులో ఎదురవుతున్న సమస్యల కారణంగా సంక్షేమ హాస్టళ్లను మూసివేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఇలాంటి చర్యల వల్ల పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల చదువులకు ఆటంకం కలిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. హాస్టళ్ల నిర్వహణకు ఆటంకాలు లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే నిత్యావసర సరుకుల సరఫరాలో విఫలమైందని ఆరోపిస్తూ, నాకాఫ్ (NCCF) కాంట్రాక్టును వెంటనే రద్దు చేయాలని మహేష్ డిమాండ్ చేశారు. సరుకుల సరఫరా నిలిచిపోవడంతో ఉమ్మడి జిల్లాలోని 1,024 గురుకులాలు, 243 ఆశ్రమ పాఠశాలలు, 400కు పైగా కేజీబీవీల్లో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, నిత్యావసర సరుకులు సకాలంలో అందేలా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని, హాస్టళ్ల నిర్వహణలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. విద్యార్థుల విద్య, ఆరోగ్యం, సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ హాస్టళ్లను నిరంతరాయంగా నిర్వహించాలని పీడీఎస్‌యూ విజ్ఞప్తి చేసింది.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

రూ.4 వేల లంచం కేసులో మాజీ పంచాయతీ కార్యదర్శికి రెండేళ్ల జైలు

- **శాయంపేట అవినీతి కేసులో వరంగల్ ఏసీబీ కోర్టు కీలక తీర్పు.. రూ.10 వేల జరిమానా**

హనుమకొండ, అక్టోబర్ 27 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి):



లంచం డిమాండ్ చేసి తీసుకున్న అవినీతి కేసులో శాయంపేట మాజీ పంచాయతీ కార్యదర్శికి కోర్టు రెండేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. హనుమకొండ జిల్లా శాయంపేట గ్రామ పంచాయతీ పరిధిలో 2008లో నమోదైన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేసులో నేరం రుజువు కావడంతో వరంగల్ ఏసీబీ కోర్టు ఈ తీర్పు వెలువరించింది.వివరాల ప్రకారం.. అప్పట్లో శాయంపేట గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన కుమారస్వామి, ఓ పని నిమిత్తం ఫిర్యాదుదారుడి నుంచి రూ.4,000 లంచం డిమాండ్ చేసి తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన అధికారులు దర్యాప్తు చేపట్టారు.సుదీర్ఘ న్యాయ ప్రక్రియ అనంతరం ఈ కేసును విచారించిన వరంగల్ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి క్షమా దేశ్‌పాండే సోమవారం తుది తీర్పు వెలువరించారు. నిందితుడు కుమారస్వామికి రెండేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. లంచం కేసులో వెలువడిన ఈ తీర్పు ప్రభుత్వ విధుల్లో అవినీతికి పాల్పడే వారికి హెచ్చరికగా నిలుస్తుందని చర్చ జరుగుతోంది.

సైబర్ మోసాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి: ఎస్ఐ హనుమాన్ నాయక్

- **హుజూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలీసుల అవగాహన సదస్సు**




హుజూర్‌నగర్, అక్టోబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):

రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని హుజూర్‌నగర్ ఎస్ఐ హనుమాన్ నాయక్ సూచించారు. సైబర్ మోసాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ డిజిటల్ భద్రతపై అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు.మంగళవారం హుజూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ఆన్‌లైన్ ఆర్థిక మోసాలు, లోన్ యాప్‌ల వేధింపులు, డిజిటల్ అరెస్ట్ పేరుతో జరుగుతున్న మోసాలు, ఫిషింగ్ లింకులు, సోషల్ మీడియా దుర్వినియోగం వంటి అంశాలపై విద్యార్థులకు వివరించారు.గుర్తుతెలియని వ్యక్తులు పంపే అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని, ఓటీపీలు, బ్యాంకు వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. అధిక వడ్డీ ఆశ చూపే అనుమానాస్పద లోన్ యాప్‌లకు దూరంగా ఉండాలని, డిజిటల్ అరెస్ట్ పేరుతో ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే భయపడి డబ్బులు బదిలీ చేయవద్దని తెలిపారు.సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 జాతీయ సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని ఎస్ఐ హనుమాన్ నాయక్ సూచించారు. డిజిటల్ లావాదేవీల విషయంలో జాగ్రత్తలు పాటిస్తూ, ఇతరులకు కూడా సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రేపు విద్యాసంస్థలకు సెలవు

- **ఆర్నబ్ తుపాను ప్రభావం.. భారీ వర్షాల హెచ్చరికతో కలెక్టర్ కీలక ఆదేశాలు**

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):



PROCEEDINGS OF THE COLLECTOR & DISTRICT MAGISTRATE
BHADRADRI KOTHAGUDEM DISTRICT
PRESENT: SRI ANKIT, IAS

Rc. No. D2/3183/Holiday/2026 Dt: 27.10.2026

Sub: Disaster Management – Bhadradri Kothagudem District – Anticipated impact of "Arnab Cyclone" – Heavy rainfall and adverse weather conditions – Declaration of holidays to all schools and colleges and AWCS (Aganwadi centers) in the District **28.10.2026 (1 day)** – Orders – Issued.

Read: Weather warnings and bulletins issued by the India Meteorological Department (IMD) date.27-10-2026

ORDER:

Whereas, in view of the weather warnings issued by the India Meteorological Department (IMD) regarding the anticipated impact of the "Arnab Cyclone", adverse weather conditions and heavy rainfall are likely to affect the District, potentially disrupting normal life and posing risks to the safety of students and educational staff.

And whereas, it is necessary to take precautionary measures to ensure the safety and well-being of students and staff of educational institutions across Bhadradri Kothagudem District.

Therefore, in the interest of public safety, **the Collector & District Magistrate, Bhadradri Kothagudem District, hereby declares holidays for all Government, Government-aided and private schools and colleges, and AWCS (Aganwadi centers) in the District 28.10.2026 (1 day)** as a precautionary measure in view of the anticipated adverse weather conditions.

District Educational Officer, District Welfare Officer, Regional and District Intermediate Education Officer, Mandal Educational Officers, and heads of all educational institutions and shall ensure strict compliance with these orders and communicate the same to all concerned without delay.

The situation shall be reviewed based on subsequent weather updates, and further instructions, if necessary, will be issued accordingly.

Collector & District Magistrate
Bhadradri Kothagudem


To:
1. The Superintendent of Police, Bhadradri Kothagudem District, for information.
2. The Sub Collector, Bhadrachalam and Revenue Divisional Officer, Kothagudem for information.
3. The District Educational Officer, Bhadradri Kothagudem District.
4. District Educational Officer, District Welfare Officer, Bhadradri Kothagudem District.
5. All Mandal Educational Officers in the District.
6. All concerned officers and educational institutions heads.
7. All Tahsildars in the District.

ఆర్నబ్ తుపాను ప్రభావంతో భారీ వర్షాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉండటంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు బుధవారం (అక్టోబర్ 28) ఒకరోజు సెలవు ప్రకటించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ అన్మిత్, ఐఏఎస్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.భారత వాతావరణ శాఖ (ఐఎండీ) జారీ చేసిన వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యాసిబ్బంది భద్రత దృష్ట్యా ఈ ముందస్తు జాగ్రత్త చర్య తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ సెలవు వర్తించనుంది. జిల్లా విద్యాశాఖాధికారి, జిల్లా సంక్షేమ అధికారి, విద్యాశాఖ అధికారులు, మండల విద్యాధికారులు, విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. తదుపరి వాతావరణ పరిస్థితులను సమీక్షించి అవసరమైతే మరిన్ని సూచనలు జారీ చేస్తామని తెలిపారు.

భూమదేవరపల్లిలో 27 మందికి కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

- **రూ.27.03 లక్షల ఆర్థిక సాయం అందజేత**

భీమదేవరపల్లి, అక్టోబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):



అధికారులు, సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణలక్ష్మి పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. భీమదేవరపల్లి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండలానికి చెందిన 27 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.27,03,132 విలువైన కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోచంపల్లి రాజిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ కృషితో అర్హులైన పేద కుటుంబాలకు సంక్షేమ పథకాల ఫలాలు అందుతున్నాయని తెలిపారు. ఆడపిల్లల వివాహ సమయంలో కుటుంబాలపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించి, వారికి భరోసా కల్పించడంలో కళ్యాణలక్ష్మి పథకం కీలక పాత్ర పోషిస్తోందన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ పథకాల ద్వారా లబ్ధి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఓ రాజేష్, ఎంపీడీఓ వీరేశం, మండల

అమరవీరులకు నివాళి.. హెల్మెట్లు ఏవీ పోలీసులూ!

- **పోలీసుల బైక్ ర్యాలీలో హెల్మెట్లు కరువు.. రహదారి భద్రతపై విస్మయం**
- **భద్రతపై బోధనలు చెప్పే పోలీసులే నిబంధనలు బేకాతర్.. హుజూర్‌నగర్ బైక్ ర్యాలీపై చర్చ**

హుజూర్‌నగర్, అక్టోబర్ 27 (ప్రజానేస్తం జ్వాల)



పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా హుజూర్‌నగర్ పట్టణంలో మంగళవారం పోలీసులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అయితే, ప్రజలకు రహదారి భద్రతపై అవగాహన కల్పించాల్సిన పోలీసులే హెల్మెట్లు ధరించకుండా ర్యాలీలో పాల్గొనడం చర్చనీయాంశంగా మారింది.పట్టణంలోని పొట్టి శ్రీరాములు సెంటర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ ఇందిరా చౌక్ వరకు కొనసాగింది. ఎస్ఐ చలికంటి నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు నివాళులర్పించే లక్ష్యంతో చేపట్టిన ర్యాలీలో హెల్మెట్ల వినియోగం కనిపించకపోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.రహదారి ప్రమాదాల్లో ప్రాణాలను కాపాడటంలో హెల్మెట్ కీలక పాత్ర పోషిస్తుంది. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ప్రజలకు సూచించే పోలీసులే వాటిని ఆచరణలో చూపాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అమరవీరుల త్యాగాలకు నిజమైన నివాళి ప్రజల ప్రాణాలను కాపాడటమేనని, అందుకు రహదారి భద్రతా నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని పలువురు సూచిస్తున్నారు.

వెంకటేశ్ సినిమాకు గుడ్ న్యూస్.. టికెట్ ధరల పెంపుకు ఏపీ సర్కార్ గ్రీన్ సిగ్నల్

- **వెంకటేశ్ 'ఆదర్శ కుటుంబం-ూఖ47'కు టికెట్ ధరల పెంపు**
- **మల్టీప్లెక్స్‌లో రూ.75, సింగిల్ స్క్రీన్‌లో రూ.50 అదనపు వసూలుకు ఛాన్స్**
- **రోజుకు ఐదు షోలు ప్రదర్శించుకునేందుకు వెసులుబాటు**

విక్టరీ వెంకటేశ్ హీరోగా నటించిన 'ఆదర్శ కుటుంబం -ూఖ47' సినిమాకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఈ సినిమా టికెట్ ధరలను పెంచుకునేందుకు, రోజుకు ఐదు షోలు ప్రదర్శించుకునేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సినిమా విడుదలకు రెండు రోజుల ముందే ఈ అనుమతి లభించడంతో చిత్ర బృందానికి పెద్ద ఊరట లభించింది.తాజా ఉత్తర్వుల ప్రకారం... రాష్ట్రవ్యాప్తంగా మల్టీప్లెక్స్‌లలో ఒక్కో టికెట్‌పై రూ.75, సింగిల్ స్క్రీన్ థియేటర్లలో రూ.50 వరకు అదనంగా వసూలు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. చిత్ర నిర్మాత ఎస్. రాధాకృష్ణ (హారికా అండ్ హాసిని క్రియేషన్స్) చేసిన విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ ఉత్తర్వులు జారీ చేశారు. టికెట్ ధరల పెంపునకు సంబంధించి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లు, లైసెన్సింగ్ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ యాక్షన్, ఫ్యామిలీ డ్రామాలో శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటించింది. గతంలో వెంకటేశ్ హీరోగా, త్రివిక్రమ్ రచయితగా 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' వంటి విజయవంతమైన చిత్రాలు వచ్చాయి. ఇప్పుడు త్రివిక్రమ్ దర్శకత్వంలో వస్తుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.



ఎనక్కు మూడలే

కాలం తెచ్చిన కరువు....
కులం మతం సూడలేదు....
ఏరును ఎండబెట్టింది....
ఊరును వలసబాట పట్టించింది....



అవ్వ అయ్యకు పైలమని జెప్పి,
ఆలి నెత్తిన పాతగుడ్డల మూటనెత్తి,
బిడ్డను భుజాలపై ఎక్కించుకొని,
పట్నం వైపు మొఖం మలిపిన.
ఊరు విడిచి వెళ్తున్న ఏడుపే రాలే,
ఎందుకంటే కండ్లల్లో నీళ్లే ఇంకిన రోజులవి,
ఊరి పొలిమేర దాటేవరకు మళ్లీ ఎనక్కు సూడలే,
ఊరు గుర్తొచ్చి తిరిగి ఎల్లి పోతానేమోనని.
పట్నం వొచ్చినంకా కాసింత పని దొరికింది,
ఎండిన పేగుల్లో కూసింత మెతుకు నిండింది,
పల్లెకు పొద్దు మాపులు ఉంటే,
పట్నంకి ఊరుకులు పరుగులు ఉన్నాయి.
ఉన్నదాంట్లో దర్జాగా బతుకు వెళ్లదీసుకుంటున్నా,
మా మొఖాలు గుర్తుపట్టే మనుషులే లేరాయే,
మాట వరుసకైనా పలకరింపులే లేవాయే,
మానవ సంబంధాలకు అడ్రస్సే లేదాయే...
పట్నం వొచ్చి పాతికేండ్లయినా,
ఊరు యాదికొచ్చినప్పుడల్లా,
ఊపిరి వదిలినంత బాధుంటది,
కండ్లల్లో నీళ్లు ఊట సేలిమేలై ఊరుతుంటాయి.

రచన : రామ్ సైదులు
పొనుగోడు (గ్రామం)
గరిడేపల్లి (మండలం)
సూర్యాపేట (జిల్లా)
సెల్ నెంబర్ : 8185810083

